మోడల్ స్కూల్ పిలుస్తోంది..

- ఇంటర్ ప్రవేశాలు షురూ
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- ఈ నెల 20 వరకు గడువు
- జిల్లాలో 13 మోడల్ స్కూళ్లు
- బాలికలకు హాస్టల్ వసతి


మల్లాపూర్ మోడల్ స్కూల్

మల్లాపూర్: ఇంటర్ ఇంగ్లిష్ మీడియంలో చదవాలనుకునే గ్రామీణ విద్యార్థులకు ఆదర్శ పాఠశాలలు ఓ వరం. 2025–26 విద్యా సంవత్సరానికి ఇంటర్‌లో ప్రవేశాలకు ఈ నెల 5 నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణకు నోటిఫికేషన్ వెలువడింది. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన గ్రామీణ విద్యార్థులకు ఇది సువర్ణావకాశం.

జిల్లాలో 13 ఆదర్శ పాఠశాలలు..

జిల్లాలో కండ్లపల్లి(జగిత్యాల), గొల్లపల్లి, మగ్గిడి(ధర్మపురి), మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, కథలాపూర్, కల్లూర్(కోరుట్ల), నూకపెల్లి(మల్యాల), పెగడపల్లి, ఇటిక్యాల(రాయికల్), కుమ్మరిపల్లి(వెల్గటూర్), కొడిమ్యాల, మేడిపల్లితో కలిపి మొత్తం 13 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. ప్రతి పాఠశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. గ్రూపునకు 40మంది విద్యార్థుల చొప్పున ప్రతీ పాఠశాలలో 160 మందికి అవకాశం కల్పిస్తారు. ఆయా మండలాలు, సమీప మండలాల విద్యార్థులకు ఇది మంచి అవకాశం.

ఈ నెల 20 వరకు గడువు..

ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఈ నెల 5 నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి. ఇంటర్ విద్యతో పాటు ఎంసెట్, నీట్, సీఏ, సీపీటీ కోచింగ్ ఇస్తారు. ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందజేస్తారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయవచ్చు. ఈ నెల 21న దరఖాస్తులు పరిశీలించి, ఎంపికైన వారి జాబితాను పాఠశాలల్లో ప్రదర్శిస్తారు. ఈ నెల 22 నుంచి 26 వరకు ఎంపికైన విద్యార్థుల విద్యార్హత ధ్రువపత్రాలను పరిశీలించి ప్రవేశాలు కల్పించనున్నారు. జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

బాలికలకు హాస్టల్ సౌకర్యం..

జిల్లాలోని 13 ఆదర్శ పాఠశాలల్లో చదువుతున్న బాలికలకు మాత్రమే హాస్టల్ సౌకర్యం ఉంది. హాస్టల్‌లో 9, 10 తరగతులతో పాటు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న వంద మంది విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉంది. హాస్టల్‌కు కనీసం మూడు కిలోమీటర్ల కన్నా దూరంగా ఉండేవారు మాత్రమే అర్హులు.

ఇంటర్ ప్రవేశాలకు రిజర్వేషన్ల సీట్లు

ప్రతి గ్రూపునకు 40 సీట్లు.. కేటాయింపులు ఇలా

కేటగిరి	శాతం	సీట్లు	జనరల్	బాలికలు
జనరల్	50	20	13	07
ఎస్సీ	15	06	04	02
ఎస్టీ	06	02	01	01
బీసీ–ఏ	07	03	02	01
బీసీ–బీ	10	04	03	01
బీసీ–సీ	01	00	00	00
బీసీ–డీ	07	03	02	01
బీసీ–ఈ	04	02	02	00

సద్వినియోగం చేసుకోవాలి



ఆదర్శ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఎన్‌సీసీలో ప్రత్యేక శిక్షణ ఉంటుంది. ఇంటర్ విద్యార్థినులకు హాస్టల్ వసతి కల్పిస్తున్నాం. మిగిలిన సీట్లల్లో మిగతా తరగతులకు చెందిన విద్యార్థినులకు హాస్టల్ వసతి కల్పిస్తున్నాం. నాణ్యమైన విద్య, చక్కని క్రమశిక్షణ, మెరుగైన ఫలితాలతో ముందంజలో ఉన్న ఆదర్శ పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఉత్సాహం చూపిస్తున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి.
– భూమేశ్, ప్రిన్సిపాల్, మోడల్ స్కూల్, మల్లాపూర్



ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద చెట్టు ఎండిపోయి ప్రమాదకరంగా ఉంది. నిత్యం మండల పరిషత్ కార్యాలాయానికి వివిధ పనుల నిమిత్తం ప్రజలు వస్తుంటారు. తమ ద్విచక్రవాహనాలను కూడా చెట్ల కిందనే పార్కింగ్ చేస్తున్నారు. ఈ ఎండిపోయిన చెట్టు ఏ సమయంలో అయినా విరిగిపడే ప్రమాదం ఉంది. కాబట్టి ఏదైనా ప్రమాదం జరగకముందే చెట్టును తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
చంద్రశేఖర్,ఎంపీడీవో- ఇబ్రహీంపట్నం, సెల్ నం.: 9951333705

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

క్లుప్తంగా

నృసింహుడిని దర్శించుకున్న ప్రభుత్వ విప్


విప్‌కు స్వామివారి శేష వస్త్రం, ప్రసాదం అందిస్తున్న అధికారులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో బుధవారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక పూజలు జరిపారు. దేవస్థానం ఈవో శ్రీనివాస్ స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు చైర్మన్ జక్కు రవీందర్, సభ్యులు, వేదపండితులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ


సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి

కథలాపూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శ్రీనివాస్ బుధవారం తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో రికార్డులు, ఆయా విభాగాలను పరిశీలించారు. మందుల నిల్వలను పరిశీలించి పీహెచ్‌సీ, ఆరోగ్య ఉపకేంద్రాల్లో క్రమం తప్పకుండా గర్భిణులకు, చిన్నారులకు వాక్సిన్లు వేయాలని వైద్యసిబ్బందికి సూచించారు. ఆయన వెంట వైద్యాధికారి సింధూజ, సూపర్‌వైజర్లు మురళి, శ్రీనివాస్, శ్రీధర్, వైద్యసిబ్బంది ఉన్నారు.

డీటీవోను కలిసిన డీఎం


డీటీవోను సన్మానిస్తున్న డీఎం, సిబ్బంది

జగిత్యాలటౌన్: జిల్లా రవాణా అధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన భద్రూనాయక్‌ను జగిత్యాల డిపో మేనేజర్ కల్పన బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి తలంబ్రాలతో పాటు ఆర్టీసీ క్యూఆర్ కోడ్‌తో ఉన్న కీచైన్‌ను అందజేశారు. ఆమె వెంట మెకానికల్ సూపర్‌వైజర్ చంద్రయ్య, ఆర్టీసీ సిబ్బంది ఉన్నారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

మెట్‌పల్లి: పట్టణంలోని మినీ స్టేడియంలో వరల్డ్ అథ్లెటిక్స్ డేను పురస్కరించుకుని బుధవారం జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు పలు గ్రామాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో ప్రతిభ చూపిన వారికి అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు.అథ్లెటిక్స్ డే సందర్భంగా జిల్లాలో పది చోట్ల పోటీలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గజెల్లి రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి


ధాన్యం పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

జగిత్యాలరూరల్: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని జగిత్యాల రూరల్ తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ మార్కెట్ యార్డులోని కొనుగోలు కేంద్రం, మోరపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని వెంటనే ఆరబెట్టి తూకం వేయించాలన్నారు. రైతులు ఎవరూ అధైర్యపడొద్దన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయికుమార్, సీఈవో వేణు, నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

మల్యాల: మండలంలోని తక్కళ్లపల్లి 11 కేవీ ఫీడర్ పరిధిలో గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగనుందని విద్యుత్ ఏఈ దయానంద్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం


రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యం

మల్యాల: అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని, చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని ముత్యంపేట, రామన్నపేట గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు సంక్షేమ ప్రభుత్వం ఉందని, రైతులకు అండగా ఉంటామని అన్నారు. ప్రతిపక్ష పార్టీల మాటలకు రైతులు ఆందోళన చెందవద్దని, రైతులకు ఏమైన ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వెల్మ లక్ష్మారెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్, సంత ప్రకాశ్‌రెడ్డి, నేరెళ్ల సతీశ్ రెడ్డి, తాళ్ల హరినాథ్, మర్రిపెల్లి లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు.

కొండగట్టులో బీజేపీ నాయకుల పూజలు

మల్యాల: ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావాలని కోరతూ మల్యాల మండల బీజేపీ అధ్యక్షుడు గాజుల మల్లేశం ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు బుధవారం ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బింగి వేణు, మాజీ ఎంపీటీసీ కొల్లూరి గంగాధర్, కెల్లేటి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రారంభం

కథలాపూర్: మండలంలోని ఏడు గ్రామాల్లో ఉపాధిహామీ సామాజిక తనిఖీ బుధవారం ప్రారంభమైంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో మండలంలో ఉపాధిహామీ పథకంలో రూ. 5 కోట్ల పనులు చేపట్టినట్లు ఎస్ఆర్‌పీ ప్రదీప్‌కుమార్ తెలిపారు. మండలంలోని పోతారం, ఇప్పపెల్లి, కలిగోట, అంబారిపేట, తుర్తి, పోసానిపేట, దూలూర్ గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం సభ్యులు క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి నివేదక తయారు చేస్తున్నారు. తనిఖీల తర్వాత గ్రామసభలు నిర్వహిస్తామని అధికారులు పేర్కొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కోరుట్ల: ఈ నెల 12న మెట్‌పల్లిలో నిర్వహించే బుద్ధ పూర్ణిమ విజయవంతం చేయాలని ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్ అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బుదవారం బుద్ధ పూర్ణిమ మహోత్సవ కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు బటిజ రాజరెడ్డి, వుయ్యాల నర్సయ్య, బుద్దిస్ట్ సొసైటీ అధ్యక్షుడు దయ్య రఘువీర్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

పెగడపల్లి: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ట్రైనీ ఎస్సై రవీందర్ కుమార్ అన్నారు. పెగడపల్లి బస్టాండ్ ఆవరణలో బుధవారం సాయంత్రం ప్రయాణికులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు ఖాతా వివరాలు లేదా ఓటీపీ అడిగితే చెప్పొద్దన్నారు. ఫోన్ లేదా మెయిల్ ద్వారా వచ్చే వెబ్‌సైట్‌లను ఓపెన్ చేయొద్దన్నారు. ప్రమాద పరిస్థితులు, దొంగలు, అనుమానితులు అకస్మికంగా దాడి చేసిన ప్పుడు డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. హెచ్‌సీ రవీందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సింధూర్‌తో త్రివిధ దళాల సత్తా

సారంగాపూర్: ఆపరేషన్ సింధూర్‌తో దేశ ప్రజలు దేశ త్రివిధ దళాలకు ప్రజలు రుణపడి ఉన్నారని బీఆర్ఎస్ సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల అధ్యక్షులు తేలు రాజు, నేరెల్ల సుమన్ అన్నారు. బుధవారం మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని కొన్ని గంటల్లోనే కట్టడి చేసిన భారత సైనికాదళం తన సత్తాచాటిందని తెలిపారు. వారి వెంట చుక్క అంజి, బండారి వెంకటేశ్ ఉన్నారు.

పాకిస్తాన్,బంగ్లాదేశీయులను పంపించాలి



కోరుట్ల, ధర్మపురిలో ఆర్డీవో, తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

కోరుట్ల/ధర్మపురి/రాయికల్/మెట్‌పల్లి/మల్లాపూర్/పెగడపల్లి: పాకిస్తాన్, బంగ్లాదేశ్ దేశస్తులు అక్రమంగా నివసిస్తే వారిని పంపించి వేయాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం ఆర్డీవోలు, మండల తహసీల్దార్లకు వినతిపత్రాలు అందించారు. పాకిస్థాన్, బంగ్లాదేశీయులు అక్రమంగా చొరబడి పట్టణాలు, గ్రామాల్లో ఉంటున్నారనే అనుమానాలు ప్రజలు వ్యక్తం చేస్తున్నారని వెంటనే వారిని గుర్తించి వాళ్ల దేశాలకు పంపాలని పేర్కొన్నారు. ఉగ్రవాద శిబిరాలపై భారత ఆర్మీ దాడి చేసి వాటిని ధ్వంసం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ పలు చోట్ల బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమాల్లో బీజేపీ పట్టణ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి


పూజలు చేస్తున్న మహిళలు

రాయికల్/మెట్‌పల్లి: రాయికల్, మెట్‌పల్లి పట్టణాల్లోని వాసవీమాత ఆలయాల్లో బుధవారం వాసవి కన్యక పరమేశ్వరి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కుంకుమపూజలు నిర్వహించారు. మహిళలకు వాసవి మాత విగ్రహాలను అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు మైలారపు లింబాద్రి, పట్టణాధ్యక్షులు మైలారపు రాము, మెట్‌పల్లి మండల అధ్యక్షుడు గంప ఆనందం, మహిళ అధ్యక్షురాలు జిల్లాల లావణ్య, సంఘం నాయకులు ఎనగందుల వీరేశం, లింగ శ్రీనివాస్, కొండూరి రాజేశ్, కోట కిరణ్‌కుమార్, కొత్త నవీన్, ముక్క నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

ధర్మపురి: ధర్మపురిలోని నాగమయ్య మానసాదేవి ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయ హక్కు దారులు కొరిడె శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వేద పండితులు దిలీప్‌శర్మ, కాసర్ల వంశీకృష్ణ, కొరిడె చంద్రశేఖర్‌శర్మ, రఘునాథశర్మల మంత్రోచ్చారణలతో విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వేసవికాలంలో హోం రేషన్ ఇవ్వాలి

రాయికల్: అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు వచ్చినందునా గర్భిణులు, చిన్నారులకు టేక్ హోం రేషన్ ఇవ్వాలని సీడీపీవో మమత సూచించారు. మండలంలోని చంతలూరు, బోర్నపల్లి గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం గర్భిణులు, బాలింతలకు పోషక పదార్థాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి కాలంలో ఎండలు దృష్ట్యా తప్పనిసరిగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సువర్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల పై అప్రమత్తంగా ఉండాలి

ధర్మపురి: విద్యుత్ ప్రమాదాలపై వినియోగ దారులు అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో డీఈ రాజిరెడ్డి, ఏడీ సింధూర్ శర్మ అన్నారు. విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా ధర్మపురి పట్టణంలో బుధవారం ధర్మపురి, నేరెల్ల, వెల్గటూర్, రాజారాంపల్లె పని చేస్తున్న ఉద్యోగులకు విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తూ జిల్లాను ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దుతామని అధికారులు, సిబ్బంది ప్రమాణం చేశారు. కార్యక్రమంలో ఏఈలు రవి, రాజశేఖర్, శ్రీనివాస్ తదితరులున్నారు.

ధర్మపురిలో హైమాస్ట్ లైట్లు ప్రారంభం

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయం ముందు హైమాస్ట్ లైట్లు లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యను పరిష్కరించాలని దేవస్థానం ఈవో శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కమిషనర్ నూతన పరికరాలను తెప్పించి బుధవారం లైట్లను బిగించారు.

బస్టాండ్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

కోరుట్ల: పట్టణంలోని బస్టాండ్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకుడు కుంచం రమేశ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నాడు. సీసీ కెమెరాలు లేక పోవటంతో పోలీసులు బస్టాండ్ వద్ద బైక్ దొంగలను పట్టుకోలేక పోతున్నారని, అలాగే ఎలాంటి దొంగతనాలు జరిగినా గుర్తించటం ఇబ్బందిగా మారిందన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే దొంగలను సులభంగా గుర్తించవచ్చని పేర్కొన్నాడు.

నువ్వు పంటలతో లాభాలు

జగిత్యాల: నువ్వు పంటతో లాభాలుంటాయని శాస్త్రవేత్త డాక్టర్ పద్మజ అన్నారు. బుధవారం పొలాస వ్యవసాయ పరిశోధన క్షేత్రంలో నువ్వు పంటలో ప్రథమశ్రేణి ప్రదర్శనలో భాగంగా నువ్వు పంట సాగుచేసిన రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి కాలానికి అనువైన నువ్వు రకాలు, వాటి దిగుబడి సామర్థ్యం ఎలా అని రైతులకు వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు బలరాం, రజినిదేవి, లక్ష్మీ పాల్గొన్నారు.

నేడు రైతులతో శాస్త్రవేత్తల సమావేశం

బుగ్గారం: మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం స్థానిక రైతులతో పొలాస శాస్త్రవేత్తల సమావేశం ఉంటుందని ఏవో అక్షిత తెలిపారు. రైతులంతా ఉదయం 8 గంటలకు రైతువేదిక వద్దకు వచ్చి కార్యక్రమంలో పాల్గొనాలని ఏవో తెలిపారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

కోరుట్ల రూరల్: పంటలకు తక్కువ యూరియా వాడకంతో పాటు రసాయనాలను తక్కువ వినియోగించి ఖర్చు ఆదా చేసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు అన్నారు. మండలంలోని నాగులపేటలో రైతు ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవెత్తలు, వ్యవసాయ అధికారులు రైతులకు పంటల సాగుపై పలు సూచనలు సలహాలు చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సింగిరెడ్డి నర్సారెడ్డి, ఏడీఏ రమేష్, ఏవో లావణ్య, శాస్త్రవేత్తలు,ఏఈవోలు హార్టీకల్చర్ అధికారి రజిత, రైతులు పాల్గొన్నారు.

సారంగాపూర్: రైతులు పంటల్లో యూరియా వాడకం తగ్గించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు పి. అరుణ్‌కుమార్, జి. ప్రజ్ఞ అన్నారు. బుధవారం మండలంలోని మ్యాడారంతండా గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా రైతులకు సాగువిధానంలో మెలకువలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూరియా వాడకం పెరగడం ద్వారా పంటలో చీడపీడల తీవ్రత కూడ పెరుగుతుందని గుర్తించాలన్నారు. రైతులు పురుగుల మందులు అవసరం మెరకే వాడాలని పేర్కొన్నారు. పంట మార్పిడి ద్వారా రైతులు మంచి లాభాలు పొందుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈవో వెంకటేశ్, రైతులు పాల్గొన్నారు.

మల్యాల: మండలంలోని ముత్యంపేట గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా బుధవారం రైతులకు నీటి యాజమాన్యం,. పంటల మార్పిడి, చెట్లను పెంచడం, పర్యావరణాన్ని కాపాడడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ రజనీకాంత్, డాక్టర్ ఎన్.సాయినాథ్, మండల వ్యవసాయాధికారి చంద్రదీపక్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాణ్యమైన విద్య


రేచపల్లిలో ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

రాయికల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు సరిపడా అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయని కళాశాల అధ్యాపకుడు శ్రీనివాస్ అన్నారు. మండలంలో పదో తరగతి పాసైన విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరాలని కోరారు. కార్యక్రమంలో అరవింద్, రాకేశ్, మారుతి, గణేశ్ పాల్గొన్నారు.

రేచపల్లిలో అధ్యాపకుల ప్రచారం

సారంగాపూర్: సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు తీసుకోవాలని బుధవారం మండలంలోని రేచపల్లిలో కళాశాల అధ్యాపకులు ప్రచారం చేశారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థుల తల్లితండ్రులను, విద్యార్థులను కలిసి కళాశాలలో అందుతున్న విద్యావిధానంపై వివరిస్తూ అడ్మిషన్లు స్వీకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్ బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతులు వివరాలు నమోదు చేసుకోవాలి

ఇబ్రహీంపట్నం: రైతులు ఫార్మర్ రిజిస్ట్రీలో పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. దేశంలోని ప్రతీ రైతుకు 11 నెంబర్‌లతో విశిష్ట సంఖ్య (యూనికోడ్)ని కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. రైతు విశిష్ట సంఖ్యను (ఫార్మర్ ఐడీ) పొందుటకు ఆదార్‌కార్డు, భూ యజమాన్య పాసు పుస్తకం, ఆదార్‌కార్డుకు లింకు చేయబడిన ఫోన్ నెంబర్ తీసుకుని వ్యవసాయ అధికారి లేదా వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించాలని పేర్కొన్నారు.

రైతుల గుర్తింపు కార్డుల కోసం వివరాలు సేకరణ

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట రైతు వేదికలో రైతుల గుర్తింపు కార్డుల కోసం బుధవారం వివరాలు సేకరించారు. క్లస్టర్ పరిధిలోని రైతులు ఆధార్‌కార్డు, పట్టదారు పాస్‌బుక్, సెల్‌ఫోన్‌తో ఏఈవోలను సంప్రదించాలన్నారు. వీలైనంత త్వరగా రైతులు వివరాలు అందిస్తే వానాకాలం సీజన్‌కు సంబంధించిన ప్రభుత్వ పథకాలు లబ్ధిపొందే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు హరీశ్, శేఖర్, రైతులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. రైతులకు కష్టం


ఊట్‌పెల్లిలో ధాన్యం కుప్పల మధ్య వర్షపునీరు

కథలాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం వేకువజామున వర్షం కురియడంతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసినట్లు రైతులు తెలిపారు. వర్షం కురుస్తుందని తెలిసిన రైతులు ఇళ్ల నుంచి కొనుగోలు కేంద్రాలకు పరుగెత్తారు. ధాన్యం కుప్పలపై టార్పాలిన్ కవర్లు కప్పారు. అయినప్పటికీ కొందరి రైతుల ధాన్యం తడిసిందని, కొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.